ప్రజాశక్తి
గురువారం 8 మే 2025 5 అనంతపురం

హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

మృతి చెందిన చిన్నారులు, వారి నానమ్మ

కన్నీటి శోకం..!

◆ నీటమునిగి అక్కాతమ్ముడు మృతి

◆ కాపాడబోయిన నానమ్మ కూడా..

◆ యల్లనూరు మండలం కల్లూరులో విషాదం

నానమ్మతో కలిసి సంతోషంగా ఇంటి నుంచి వెళ్లిన వారికి అదే చివరి రోజు అయ్యింది. అక్కాతమ్ముడు ఇద్దరూ ఆడుతూ పాడుతూ నానమ్మతో కబుర్లు చెప్తూ ముందుకు సాగారు. ఆ మాటలే వారికి ఆఖరి మాటలు అయ్యాయి. నిమిషాల వ్యవధిలో సంతోషం ఆవిరైంది. అనుకోని ప్రమాదం చిన్నారులిద్దరినీ బలిగొంది. కళ్లేదుటే నీటిలో కొట్టుకుపోతున్న తన వారసులను కాపాడుకునే ప్రయత్నంలో ఆ వృద్ధురాలు కూడా నీటమునిగి తుదిశ్వాస విడిచింది. ఆనందంగా వెళ్లిన వారి ఇంట గంటల వ్యవధిలోని కన్నీటి శోకం మిగిల్చింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న పిల్లలిద్దరూ అనుకోని ప్రమాదంలో మరణించడంతో తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోధించారు. యల్లనూరు మండలం కల్లూరు గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

యల్లనూరు మండలం కల్లూరు గ్రామానికి చెందిన డి.శ్రీనివాసులు, డి.ప్రశాంతి దంపతులకు లిడియా(12), జాషువా(9) సంతానం. సెలవులు కావడంతో వీరిద్దరూ వారి నాన్నమ్మ నాగలక్ష్మమ్మ ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం బట్టలు ఉతికేందుకు నాగలక్ష్మమ్మ చిన్నారులు ఇద్దరితో కలిసి వెళ్లింది. ప్రమాదవశాత్తు ముగ్గురు కాలువలో పడి మరణించారు.

ప్రజాశక్తి-యల్లనూరు

వార్త మెయిన్‌లో

కొత్తరేషన్‌కార్డులకు దరఖాస్తులు

◆ సచివాలయాల్లో తీసుకునేలా ఏర్పాట్లు

◆ కొత్త వాటికి ఈ నెల 31 వరకు గడువు

◆ డిజిటల్ ఎటిఎం తరహాలో రేషన్ కార్డు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం కొత్త తరహా రేషన్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టింది ప్రస్తుతం కలర్ ఫోటోలతో ఉన్న రేషన్ కార్డులు ఉన్నాయి. ఇకనుంచి వాటిని డిజిటల్ రూపంలోకి మార్చేందుకు చర్యలు చేపట్టింది క్యూఆర్ కోడ్ కలిగి ఏటీఎం కార్డు తరహాలో రేషన్ కార్డు రూపొందించేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు ఉన్న పాత పద్ధతిలో కాకుండా కొత్త తరహాలో రేషన్ కార్డు రానుంది. బుధవారం నుంచే కొత్త కార్డు దరఖాస్తులకు అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మే 31 లోపు దరఖాస్తు చేసుకోవడానికి అనుమతి ఇచ్చింది. జీఎస్టీడబ్ల్యూఎస్ ఫార్మెట్లో ఈ దరఖాస్తు అందజేయాల్సి ఉంటుంది.

కొత్త రేషన్ కార్డులు కోసం జిల్లా ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇప్పుడు కొత్త వాటి కోసం అనుమతినిచ్చింది. ఈసారి ఇచ్చే కార్డులు కూడా పాత వాటిలాగా కాకుండా మార్పులు చేయాలని చూస్తోంది. స్మార్ట్ కార్డు తరహాలో కొత్త రేషన్ కార్డులు మంజూరుకు చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది. క్యూఆర్ కోడ్ కలిగిన ఏటీఎం తరహాలో ఉన్న రేషన్ కార్డులను మంజూరు చేయనున్నట్టు సమాచారం. అనంతపురం జిల్లాలో ప్రస్తుతం 6,67,289 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో అంత్యోదయ కార్డులు 53,050 కార్డులు ఉన్నాయి. ఎన్ఎఫ్ఎస్ఎ కార్డులు 5,54,310 ఉన్నాయి. ఇతరులు 59,908 కార్డులు ఉన్నాయి.

కొత్త కార్డులు, మార్పులు.. చేర్పులు

ప్రభుత్వం ఇప్పుడు ఇవ్వబోతున్న రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులకు కూడా అవకాశం కల్పించింది. ఏడు రకాల సేవలను ఇప్పుడు లబ్ధిదారులు వినియోగించుకోవచ్చు కొత్త రేషన్ కార్డు, అదనంగా చేర్పులు, కార్డ్ స్ప్లిట్టింగ్, కార్డును సరెండర్, అదనంగా సభ్యుల చేర్పు, అడ్రస్ మార్పు, ఈకెవైసి సదుపాయాలను కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తులను ఆయా సచివాలయాల పరిధిలో ప్రజల నుంచి తీసుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

డీఎస్సీ గడువు పొడిగించండి : డివైఎఫ్ఐ

నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

డీఎస్సీ అభ్యర్థులు చదువుకోవడానికి 90 రోజులు సమయం ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కసాపురం రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో 2వ రోడ్డు స్టడీ పార్క్ దగ్గర అభ్యర్థులతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కసాపురం రమేష్, జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షకు చదువుకునేందుకు సమయం తక్కువగా ఉండడంతో అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి సమయాన్ని పెంచాలన్నారు. జిల్లాకు ఎస్‌జిటి పోస్టులు సంఖ్య పెంచాలన్నారు. ఒకే జిల్లా, ఒకే పరీక్ష పేపర్ ఉండాలన్నారు. వయోపరిమితి 47సంవత్సరాలకు పెంచాలన్నారు. బ్యాక్‌లాక్ పోస్టులను ఈ డీఎస్సీలోనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తరిమెల గిరి, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత

◆ కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ పి.జగదీష్

◆ సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

వజ్రకరూరు మండలం ఛాయాపురం వద్ద కలెక్టర్‌తో కలిసి హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-ఉరవకొండ

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో పర్యటించే ప్రాంతాల్లో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) ద్వారా పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు. ఈనెల 9వ తేదీన ముఖ్యమంత్రి ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామంలో హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ వెడల్పు పనులను పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో ఛాయపురం గ్రామ పరిసరాలోల కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ పి.జగదీష్‌లు ఎస్-ఎస్‌జి ఆఫీసర్స్‌తో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్‌కి సంబంధించిన రూట్ ను పరిశీలించారు. హెలిప్యాడ్, హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ వెడల్పు పనుల ప్రదేశాలు, సభా వేదిక ప్రదేశం, పార్కింగ్ స్థలాలు వద్ద బందోబస్తు, భద్రత ఏర్పాట్లను సమీక్షించి అధికారులకు జిల్లా కలెక్టర్, ఎస్పీలు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. హెలిప్యాడ్‌ను వెంటనే సిద్ధం చేసి మార్కింగ్ ఇవ్వాలన్నారు. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అంబులెన్స్, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. హెలిప్యాడ్ వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో రాష్ట్ర ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించేందుకు అవసరమైన గదిని ఏర్పాటు చేయాలన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో గురువారం మధ్యాహ్నంలోగా పనులన్నీ పూర్తిచేసి సిద్ధంగా ఉంచాలన్నారు. కాలువ వెడల్పు చేస్తే ఎలా ఉంటుంది, పనులు చేయకముందు ఎలా ఉంటుంది అనేది స్పష్టంగా తెలిసేలా పనులు చేయాలన్నారు. కాలువలో నీరు ఉండరాదని, చాలా వేగంగా పనులు పూర్తి చేయాలన్నారు. ప్రజావేదిక వద్ద ఏర్పాట్లను పూర్తిచేయాలని, సభలోకి విఐపిలు, ప్రజలు వచ్చిపోయేందుకు అవసరమైన దారులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజావేదిక వద్ద కంప చెట్లను తొలగించాలన్నారు. ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, సిఎంఒ కార్యాలయం అధికారులు దినేష్, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ అధికారులు ఎఎస్పీ రమణమూర్తి, అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, గుంతకల్ ఆర్డీవో శ్రీనివాసరెడ్డి, కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్, ఆర్.అండ్.బి ఎస్ఈ రాజగోపాల్, మార్కెటింగ్ ఎడి సత్యనారాయణచౌదరి, సర్వే ఏడి రూప్ల నాయక్‌తో పాటు వివిధ శాఖల జిల్లా, మండలాధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి అనంతపురం రూరల్

పంచాయితీ రాజ్ పరిపాలన, విస్తరణాధికారులుగా పనిచేస్తున్న పలువురు ఇటీవల ఎంపిడిఒలుగా ఉద్యోగోన్నతులు పొందారు. ఇందులో అనంతపురం జిల్లాలో ఐదుగురు, శ్రీసత్యసాయి జిల్లాలో పది మంది ఉద్యోగోన్నతులు పొందారు. వీరందరికీ ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ బుధవారం నాడు తన కార్యాలయంలో ఉద్యోగోన్నతుల నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉద్యోగోన్నతులు పొందిన వారికి అంకిత భావంతో విధులు నిర్వహించి మరింత గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి వెంకట సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

'అల్లూరి' బాటలో నడుద్దాం

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మన్యం వీరుడు అల్లూరి సీతా రామరాజు స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో ఆయన ఆదర్శ బాటలో అందరం నడవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలియజేశారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు 27 సంవత్సరాలు మాత్రమే జీవించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బ్రిటిష్ వారికి స్వాతంత్ర్య పోరాటం సాగించారన్నారు. గిరిజనులకు అండగా ఉండి గిరిజనుల హక్కులను సాధించేదుకు కృషి చేశారని కొనియాడారు. విప్లవ వీరుడిగా నిలిచిపోయిన గొప్ప వ్యక్తి అల్లూరి అని కొనియాడాడు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డిఆర్ఒ ఎ.మలోల, కలెక్టర్ కార్యాలయం ఏవో అలెగ్జాండర్, జిల్లా టూరిజం అధికారి జయ కుమార్ బాబు, డిటిడబ్ల్యూఒ రామాంజనేయులు, ట్రైబల్ స్కూల్ ప్రిన్సిపాల్ పార్వతి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబి.దేవి

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజలతో స్నేహభావంతో మెలిగి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబి.దేవి సూచించారు. బుధవారం మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చిన్న ముష్టూరు ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. రికార్డులు పరిశీలించి సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం ఆమె ఉరవకొండ 1వ సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం పరిశీలించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంట డిప్యూటీ డెమో త్యాగరాజు, ఎఎన్ఎం హేమలత, హెల్త్ అసిస్టెంట్ రఘునాథ్ సూపర్‌వైజర్ శేఖర్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

శ్రీసత్యసాయి విమానాశ్రయంలో మాక్‌డ్రిల్

ఉగ్రదాడుల నుంచి రక్షణపై అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఉగ్రవాదులు దాడులు చేస్తే ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలి.. వారిని ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై భద్రతపరంగా బుధవారం శ్రీ సత్యసాయి విమానాశ్రయంలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు కలెక్టర్ టిఎస్.చేతన్ ఎస్పీ వి.రత్నలు పుట్టపర్తి విమానాశ్రయంలో జరిగిన మాక్ డ్రిల్‌ను పరివేక్షించారు. డీఎస్పీలు విజయకుమార్, శ్రీనివాసులు, ఆర్ఐలు మహేష్, వలి ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. విమానాశ్రయంలో ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు, వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైరన్లు మోగినప్పుడు తక్షణమే ఏమి చేయాలి.. రక్షణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలన్న విషయాలపై స్పెషల్ పార్టీ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఫైర్, హెల్త్ సిబ్బంది వెంటనే చేపట్టే చర్యలు మాక్ డ్రిల్ ద్వారా చూపించారు. దాడులకు పాల్పడితే ఆ సమయంలో ఎలాంటి భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలి, వివిఐపిలకు ఎలాంటి రక్షణ కల్పించాలి.. ప్రమాదం జరిగిన వెంటనే వారిని అంబులెన్స్ ద్వారా హాస్పిటల్‌కు ఎలా తరలించాలి.. బాంబులు అమర్చిన ప్రాంతాన్ని డాగ్స్ స్క్వాడ్ ద్వారా గుర్తించి వాటిని ఎలా డిస్పోజల్ చేయాలనే విషయాలపై మార్క్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు విజయకుమార్, శ్రీనివాసులు, ఆర్డీవో సువర్ణ, తహశీల్దార్ కళ్యాణ్, సిఐలు, సునీత, సురేష్, ఆర్ఐలు మహేష్, వలి, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఎస్ఐలు లింగన్న, కృష్ణమూర్తి ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

అభిప్రాయం చెప్పినా వేధింపులా..?

◆ పహల్గాం బాధిత మహిళలపై సోషల్ మీడియాలో ట్రోల్స్ దుర్మార్గం

◆ బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలి

◆ రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం

గత నెల 22వ తేదీన కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రవాద దాడిలో ఆత్మీయులను కోల్పోయిన హిమాన్షీ నర్వాల్, ఆరతి మీనన్‌లు ఘటనపై బాధ్యతతో కూడిన అభిప్రాయాన్ని వ్యక్తం చేసినా వారిపై సోషల్ మీడియాలో వికత పోస్టులు చేయడం అత్యంత దుర్మార్గమని పలు మహిళా సంఘాల నాయకులు అభిప్రాయ పడ్డారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో బుధవారం నాడు అనంతపురం ఎన్జీవో హోంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెవివి నాయకులు డాక్టర్ ప్రసూన ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. పెళ్లయిన పది రోజులకే భర్తను కోల్పోయిన హిమాన్షీ, తండ్రిని పోగొట్టుకున్న ఆరతిపై కనీస మానవత్వం లేకుండా సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారని ఆమె తెలిపారు. ఇలాంటి వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భారతీయ మహిళగా బాధ్యతతో కూడిన అభిప్రాయాల్ని వ్యక్తం చేయడం వారు చేసిన నేరంగా ఈ ట్రోల్స్ జరుగుతున్నాయన్నారు. ఉగ్రవాదుల్ని కఠినంగా శిక్షించాలని, చంపిన వారి మతాన్ని బట్టి ఆ మతస్థులను హింసించవద్దని చెప్పిన హిమాన్షిని అభినందించాల్సింది పోయి అతి ఘోరంగా వేధిస్తున్నారని తెలిపారు. ఆమె ఫేస్‌బుక్, వాట్సప్, ఇంస్టాగ్రామ్ అకౌంట్లోకి చొరబడి ఆమె వ్యక్తిగత జీవితాన్ని దుర్భాషలాడుతున్నారని విమర్శించారు. జాతీయ మహిళా హక్కుల కమిషన్ స్పందించినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి వారిని అరికట్టడంలో ఎందుకు చర్య తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఐద్వా నాయకురాలు సావిత్రి మాట్లాడుతూ మహిళలకూ సొంత అభిప్రాయాలు ఉంటాయని, వాటిని గౌరవించాలని మహిళా కమిషన్ చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మత ఉన్మాదులు మహిళలను గౌరవించలేరని ఈ సంఘటనలు మరోసారి రుజువు చేస్తున్నాయన్నారు. కాశ్మీర్లో స్థానిక ముస్లిములు తమకు చేసిన సహాయాన్ని చెప్పిన ఉగ్రవాద బాధిత కుటుంబాలపై సామాజిక మాధ్యమాల్లో వేధించడాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. మహిళల శరీర భాగాలను లక్ష్యంగా చేసుకుని చేస్తున్న ఈ మూకలు వారి ఫేస్ బుక్ పేజీలను దేవుని ఫోటోలు, భరతమాత ఫోటోలతో నడపడాన్ని హిందూ మత పెద్దలు, ప్రజాతంత్ర వాదులు ఖండించాలని కోరారు. భారత ప్రభుత్వం ఉగ్రవాద శిబిరాలపై చేస్తున్న ఆపరేషన్ సిందూరకు మహిళలు నాయకత్వం వహిస్తుండడం గర్వకారణం అన్నారు. సోఫియా ఖురేషి, వ్యోమికా సింగ్ ధైర్యసాహసాలకు, దేశంలోని మతసామరస్యానికి ప్రతీకలని కొనియాడారు. మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు పద్మావతి మాట్లాడుతూ భారతదేశ ఐక్య దేశం అని చెప్పారు. భారతీయులంతా ఒక్కటిగా ఉంటారని చెప్పారు. బిజెపి ఆర్ఎస్ఎస్ వ్యక్తులు ప్రజల మధ్య విభజన తీసుకొచ్చి విద్వేషాలు రగిలితే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు శేకన్న, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, నాయకులు వి.రామిరెడ్డి, యుటిఎఫ్ నాయకులు జిలాన్, ఆవాజ్ నాయకులు వలి, ఎస్ఎఫ్ఐ నాయకులు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డా॥ప్రసూన

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న పశువుల దాణాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని 74 ఉడేగోళం రైతు సేవ కేంద్రంలో సబ్సిడీతో పశువుల దాణాను పంపిణీ చేశారు. 50 కిలోల దాణ సబ్సిడీ కింద రూ.555కి అందిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ నాగ లింగేశ్వర రెడ్డి తెలిపారు. పశువుల దాణా ఉపయోగాలు, పశు బీమా, గోకులాలు, నీటి తొట్టెల నిర్మాణం తదితర వాటిపై పశువైద్యాధికారి సూర్యనారాయణ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, మాజీ జడ్పిటిసి విజయ్ కుమార్, శివానంద, ఓబన్న పాల్గొన్నారు.

దాణాను పంపిణీ చేస్తున్న కాలవ శ్రీనివాసులు

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలో వేములపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ వాసుదేవర రెడ్డి బుధవారం పరిశీలించారు. కూలీల హాజరు పట్టిక, మస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో వారంతపు సమావేశం నిర్వహించారు. ఫారం పాండ్‌ల ఉపయోగం పై రైతు లకు అవగాహన కల్పించి ఎక్కువ శాతం ఫారం పాండ్ తవ్వకాలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈసి సత్యమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్‌లు జయరాం, కుళ్లాయి స్వామి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిఒలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి
www.prajasakti.com

శ్రీ చైతన్య పాఠశాలను సీజ్ చేయండి

ప్రజాశక్తి-అనంతపురం

ముందస్తు అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతున్న శ్రీ చైతన్య పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అనంతపురం నగరం ఆదిమూర్తి నగర్‌లో ఉన్న శ్రీ చైతన్య పాఠశాల ఎదుట ఎఐఎస్‌బి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమైక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. శ్రీ చైతన్య పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ముందస్తు అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతున్నాయని చెప్పారు. విద్యాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌బి జిల్లా ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డి పల్లి పథ్వి, బీసీ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ సురేష్ యాదవ్, విజయ్, మధు, ఉపేంద్ర, మనోహర్, ప్రవీణ్, మనోజ్ పాల్గొన్నారు.

ఎంపీడీవోగా విజయసింహారెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి బ్రహ్మసముద్రం

బ్రహ్మసముద్రం నూతన ఎంపీడీవోగా విజయసింహారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయసింహారెడ్డి గతంలో కర్నూలు జిల్లా గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై బ్రహ్మసముద్రంకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎంపిడిఒ విజయసింహారెడ్డి తెలిపారు. టిడిపి నాయకులు గురుసంతప్ప ఎంపీడీవోను కలిసి అభినందనలు తెలిపారు.

శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-యాడికి

మండల కేంద్రంలోని అమ్మవారి శాలలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా తయారు చేయించిన వజ్రాల చీరను అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం, చిన్నపిల్లలతో నత్య ప్రదర్శనచ మహిళలతో పాటకచేరి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

దాణా కోసం దరఖాస్తు చేసుకోండి పశువైద్యాధికారి రమేష్

ప్రజాశక్తి-గార్లదిన్నె

సబ్సిడీ దాణా కోసం పాడి రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు రైతుకు నెలకు 50 కేజీలు చొప్పున 50 శాతం సబ్సిడీతో దాణా ఇస్తున్నట్లు తెలిపారు. మండలానికి ప్రభుత్వం 25 టన్నుల దాణాను కేటాయించిందన్నారు. ఒక్కో బ్యాగుకు సబ్సిడీ పోను రూ.555 చెల్లించాల్సి ఉందన్నారు.

సిఎం పర్యటనపై విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

ఈనెల 9వ తేదీ జరిగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.రమాదేవి వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు గుంతకల్లులో బస చేస్తారన్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. రైల్వే గెస్ట్ హౌస్, ఆర్ అండ్ బి బంగ్లా, ప్రయివేటు లాడ్జిలు, ఆహార వసతులను పూర్తి స్థాయిలో చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హరిప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-బొమ్మనహల్

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ఆర్డీటీ పాఠశాలలో ప్రభుత్వ వైద్యులు శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో వడదెబ్బపై నివారణ కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఎండలో ఎక్కువగా తిరగరాదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్తే తలపై టోపీ ధరించాలన్నారు. నీళ్లు ఎక్కువగా తాగాలన్నారు. కళ్ళు తిరగడం, నీటి దాహం ఎక్కువగా ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ మునేశ్వర, మహిళా సూపర్‌వైజర్ రుక్మిణి, నర్స్ భాగ్యశ్రీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాలపై అవగాహన

ప్రజాశక్తి-తాడిపత్రి

విద్యార్థులకు గ్రంథాలయాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నాడు తాడిపత్రి గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తులు మాట్లాడుతూ చిన్నతనం నుంచి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ ఉపాధ్యాయులు రాంబాబు, రిటైర్డ్ ఉపాధ్యాయులు జి.ఆదినారాయణ స్వామి, ఎస్.వీరారెడ్డి, బి.వెంకట రమణప్ప, సూర్యనారాయణ రెడ్డి, గ్రంథాలయ అధికారి బి.రవికుమార్ నాయుడు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

20న గ్రామీణ హర్తాల్‌ను జయప్రదం చేద్దాం

అభివాదం చేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈ నెల 20న నిర్వహించనున్న గ్రామీణ హర్తాల్‌లో రైతులు, కార్మికులు, ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు, సిఐటియు సంఘాలు కోరారు. గ్రామీణ హర్తాల్ విజయవంతం కోరుతూ బుధవారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రైతుసంఘం ఉపాధ్యక్షులు తరిమెల నాగరాజు అధ్యక్షతన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల జిల్లా కార్యదర్శులు ఓ.నల్లప్ప, నాగేంద్ర కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, బాల రంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక విధానాలకు వ్యతిరేకంగా మే 20వ తేదీ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె, గ్రామీణ హర్తాల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత 11 సంవత్సరాలుగా కేంద్రంలో నరేంద్రమోడీ నాయకత్వంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అన్ని రంగాల్లో కార్మికులు, రైతులకు, వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్పొరేట్లకు మేలు చేస్తూ వీరిని విస్మరించిందన్నారు. పోరాడా సాధించుకున్న కార్మిక చట్టాలను హరిస్తోందన్నారు. వీటిపై ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు పండించే అన్ని పంటలకు మద్దతు ధరలకు చట్టం చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు, డీజిల్, వ్యవసాయ పనిముట్ల ధరలు తగ్గించాలన్నారు. రూ.2.00 లక్షల వరకు రైతుల బ్యాంకు రుణాలు రద్దుచేయాలని కోరారు. అన్నదాత పెట్టుబడి సాయం తక్షణమే రైతుల ఖాతాలలో వేయాలన్నారు. కౌలు రైతులకు నూతన కౌలు చట్టం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి రోజు కూలీ రూ.600, 200 రోజుల పనిదినాలు కల్పించేలా చూడాలన్నారు. కార్మికులను కట్టు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్లను రద్దుచేయాలన్నారు. హంద్రీనీవా కాలువ పదివేల క్యూసెక్కుల సామర్థ్యాన్నిపెంచి, కాలువ వెడల్పు చేసి చివరి ఆయకట్టువరకు పిల్ల కాలువలు ఏర్పాటు చేసి సాగు,తాగునీరు ఇవ్వాలన్నారు. సోలార్ కంపెనీల నుండి రైతుల భూములను కాపాడాలన్నారు. సెకితో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకొన్న విద్యుత్ ఒప్పందం రద్దు చేసుకోవాని కోరారు. కరెంటు ఛార్జీలు తగ్గించాలన్నారు. పాల సేకరణ ధర లీటర్ కు 10 రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శివ, వెంకటేశులు, భాస్కర్, చెన్నారెడ్డి, రాయుడు, రాజా రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

3వ రోజు మున్సిపల్ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని మున్సిపల్ కార్మికులు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ కార్పొరేషన్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నా బుధవారం మూడవ రోజు కొనసాగింది. ఎర్రిస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సిఐటియు నగర కార్యదర్శి ముత్తుజ హాజరై మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు మూడు రోజులుగా నిరసన తెలుపుతున్నా కార్పొరేషన్ అధికారులు స్పందించకపోవడం విచారకరం అన్నారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. అనారోగ్యంతో మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించాలన్నారు. అనంతపురం నగర జనాభాకు అనుకూలంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. రూ.15 వేల వేతనం, పిఎఫ్ అమలు చేయాలన్నారు. రెగ్యులర్ కార్మికులకు మూడు సంవత్సరాలుగా బకాయి ఉన్న సరెండర్ లీవ్‌లు, సిడిఎంఎ ఇవ్వాలన్నారు. తక్షణమే నగరపాలక సంస్థ కమిషనర్ కార్మికులతో చర్చలు జరిపి సమస్యల

కార్పొరేషన్ వద్ద ధర్నాలో పాల్గొన్న కార్మికులు

పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 20న కార్మికుల చట్టాలపై చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనడమే కాక 21, 22న కూడా ఆందోళనలులో పాల్గొంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏటీఎం నాగరాజు, నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, రెగ్యులర్ ఉద్యోగ కార్మిక సంఘం నగర అధ్యక్షులు ముత్తురాజు, నగర కార్యదర్శి తిరుమలేష్, నగర సహాయ కార్యదర్శి బంగ్లా రాఘవేంద్ర ప్రసాద్, పెన్నా, కుమార్, నాగేంద్ర, పుల్లన్న, మీసాల నారాయణ, మరియమ్మ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-నార్పల

నార్పల కేంద్రంగా వెంకట్ వకుళ ఫౌండేషన్ ఛాంపియన్ షిప్ క్రికెట్ టోర్నీ ఈ నెల 10వ తేదీన ప్రారంభం కానుంది. టోర్నీకి సంబంధించిన పోస్టర్‌ను వెంకట్ వకుళ ఫౌండేషన్ ఛైర్మన్ ఆలం వెంకట నరస నాయుడు బుధవారం ఆవిష్కరించారు. శింగనమల నియోజకవర్గ వ్యాప్తంగా టోర్నీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టోర్నీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.50వేలు, రెండో బహుమతి రూ.25వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. శింగనమల నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన యువకులు టోర్నీలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, చంద్రబాబు, నడిమింటి రాము, బొగ్గు నాగార్జున, బొగ్గు

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టోర్నీ నిర్వాహకులు

నారాయణస్వామి, నడిమిదొడ్డి చంద్ర మోహన్ రెడ్డి, తలారి మహేష్, తలారి వంశీ , గణేష్, హరీష్, షామీర్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి సహకరిస్తాం

నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు. బుధవారం ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు ప్రెస్‌క్లబ్‌ను పరిశీలించారు. ప్రెస్‌క్లబ్ ఆవరణంలో ఇంకుడు గుంతలు తవ్విస్తామని, ఏదైనా ప్యాచ్‌వర్క్‌లకు సాయం అందిస్తామని తెలిపారు. కూర్చోవడానికి బెంచ్‌లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సహకరిస్తామని కమిషనర్ చెప్పడంపై పాత్రికేయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్షులు ఆజాద్, కార్యదర్శి భాస్కర్ రెడ్డి, పాత్రికేయ సంఘాల నాయకులు మచ్చా రామలింగారెడ్డి, రమేష్ రెడ్డి, డేవిడ్ పాల్గొన్నారు.

ఉత్సవాల సందర్భంగా ఎండ్ల బండ్ల ప్రదర్శన

బండిశూల ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పెద్దవడుగూరు మండలంలో ప్రధాన ఉత్సవం అయిన బండిశూల తిరునాళ్ల బుధవారం ప్రారంభం అయ్యాయి. ఐదురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు గుత్తి అనంతపురం, కాశేపల్లితో పాటు పామిడి మండలం రామరాజుపల్లిలో మొదట ప్రారంభించి సుడిబండిని సుంకులమ్మ, ముత్యాలయ్య ఆలయాల వద్దకు చేరుస్తారు. మూడు గ్రామాలతోపాటు పెద్దవడుగూరు, విరుపాపురం, ఆవులాంపల్లి, మిడుతూరు, కొత్తపల్లి, వెంకటాంపల్లి కొట్టాలపల్లి, గ్రామాలకు చెందిన రైతుల వషభాలు సుడిబండిని లాగించనున్నారు. ఈ సందర్భంగా సిఐ రామసుబ్బయ్య, ఎస్ఐ ఆంజనేయులు బందోబస్తున ఏర్పాటు చేశారు.

నేటి నుంచి కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-సింగనమల

మండల వ్యాప్తంగా గ్రామ సచివాలయ కేంద్రాల్లో కొత్త రేషన్ కార్డులకు గురువారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య తెలిపారు. కొత్త రేషన్ కార్డు పొందాలన్నా. రేషన్ కార్డులో పేరు మార్చుకోవాలన్న. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. రేషన్ కార్డులో కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. కుటుంబ విభజనలో భాగంగా కొత్త రేషన్ కార్డు మంజూరు చేస్తారన్నారు.

6,300 క్యూసెక్కులతో

హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు చేపట్టాలి

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

హంద్రీనీవా కాలువ వెడల్పును రాష్ట్ర ప్రభుత్వం 3వేల క్యూ సెక్కులు సామర్థ్యంతో చేస్తోందని, దానిని 6,300 క్యూ సెక్కుల సామర్థ్యంతో చేపట్టాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో ట్రేడ్ యునియన్ నాయకులు మాసినేని నరేష్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైసిపి హయాంలో 6,300 క్యూ సెక్కులతో కాలువ పనులు చేయాలని జీవో ఇచ్చామన్నారు. దాన్ని సీఎం చంద్రబాబు రద్దు చేయడం తగదన్నారు. గాలేరు, నగరికి హంద్రీనీవా కాలువ అనుసంధానం చేయలని జగన్ హయాంలో నిర్ణయిస్తే

విలేకరులతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

దాన్ని రద్దు చేశారని మండిపడ్డారు. ఉరవకొండకు వస్తున్న సీఎం చంద్రబాబు చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. వజ్రకరూరు చెరువుకు హంద్రీనీవా నీళ్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు .

అవగాహనతో వ్యాధుల నియంత్రణ

అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

సరైన అవగాహనతోనే మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులను నియంత్రణ చేయొచ్చని కణేకల్ అర్బన్ వైద్యాధికారి డా॥జస్వంత్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్ తెలియజేశారు. రాయదుర్గం పట్టణంలోని ఓబులాచారి రోడ్, చౌడేశ్వరి కాలనీలో ఎన్‌సిడిబిసిడి సర్వేను బుధవారం నిర్వహించారు. మధుమేహం వైద్య పరీక్షలు నిర్వహించి దాని నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. క్రమం తప్పకుండా బిపి, షుగర్ జబ్బులకు రక్త పరీక్షలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు ఈశ్వరమ్మ, రూప ఆశా కార్యకర్తలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

జేఏసీ నాయకులకు సంఘీభావం

ప్రజాశక్తి-నార్పల

రూరల్ డెవలెప్‌మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ)కి ఎఫ్‌సిఆర్ఎ నిధులను పునరుద్ధరించాలని కోరుతూ జెఎసి ఆధ్వర్యంలో అనంతపురం చేపట్టిన దీక్షలకు జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ బుధవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు అన్ని విధాలా సాయం అందిస్తున్న ఆర్డీటీకి నిధుల విషయంలో ఆంక్షలు విధించడం సరికాదన్నారు.

సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న నాగరత్నమ్మ

ఈవోఆర్డీకి సన్మానం

ప్రజాశక్తి-శింగనమల

మండల ఈవోఆర్డీ వెంకటలక్ష్మిని ఆకలేడు సర్పంచి సుభాషిణి రామాంజనేయులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఏంపీడీవో భాస్కర్, పంచాయితీ సెక్రటరీలు నరసింహారెడ్డి, ఓబిరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈవోఆర్డీ వెంకటలక్ష్మి సోమందేపల్లి ఎంపీడీవోగా ఉద్యోగోన్నతిపై వెళ్తున్న నేపథ్యంలో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలో వెంకటలక్ష్మి సేవలను కొనియాడారు.

ఈవోఆర్డీని సన్మానిస్తున్న రామాంజినేయులు తదితరులు

అన్నదానం చేస్తున్న వైసిపి నాయకులు

అనాథ, వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని కొత్తూరులో ఉన్న స్వీట్ సేవియర్స్ ఛారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన అనాథ వృద్ధాశ్రమంలో వైసిపి పట్టణ, మండల కన్వీనర్లు కె.మధుసూదన్ రెడ్డి, జి.గంగరాజు యాదవ్, నాయకులు వై.రామ సుబ్బారెడ్డి, టి.మురళి, దేవేంద్ర, ఇర్ఫాన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు, గుంతకల్ మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతి రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. వైసిపి నాయకుడు వెల్డింగ్ అబ్దుల్ రవుఫ్ తన దుకాణంలో కేక్‌ను కోసి నైరుతి రెడ్డి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సివి.రంగారెడ్డి, బి.రమేష్ రెడ్డి, డి.షఫీ, బింగికిరణ్ బాబు, మున్నా, మల్లికార్జున, సుధాకర్, కౌన్సిలర్లు వి.వరదరాజులు, కేవీ.రమణ, నరేష్ పాల్గొన్నారు.

'నారాయణ' ఎదుట ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం

నిబంధనలను పాఠించకుండా విద్యా సంస్థలను నడుపుతున్న నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకునేందుకు అధికారులకు భయం ఎందుకని ఎఐఎస్ఎఫ్ నాయకులు ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ పుస్తకాలతో వేల రూపాయల వ్యాపారం చేస్తున్న నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ నగరంలో బస్టాండ్ వద్ద ఉన్న నారాయణ పాఠశాల వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతు రాయుడు, కుళ్లాయిస్వామి మాట్లాడుతూ అధికారులు నారాయణ విద్యా సంస్థలను తనిఖీ చేసి వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. ముందస్తు అడ్మిషన్లు, పుస్తకాల వ్యాపారాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చందు, నగర అధ్యక్షులు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలందరికీ ఉపాధి పనులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని అన్ని గ్రామాల్లో కూలీలందరికీ ఉపాధి హామీ పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో అలివేలమ్మ టీఏలకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో టిఎలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో విధిగా ఉపాధి పనులు కల్పించాలన్నారు. కూలీలకు కనీస వేతనం రోజుకి రూ.300 రూపాయలు వచ్చే చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవీ నరేంద్ర, ఈసీ అజయ్ కుమార్, టీఏలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి-యాడికి

రూరల్ డెవలెప్‌మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ)కి ఎఫ్‌సిఆర్ఎ నిధులను పునరద్ధరించాలని కోరుతూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బుధవారం నాడు తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డికు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బషీర్, సిపిఐ నాయకుడు వెంకటరాముడు యాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పేదలకు అండగా ఉన్న ఆర్డీటీకి విదేశీ నిధులను రాకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఎఫ్‌సిఆర్ఎ నిధులు వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వడ్డె రాముడు, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఆదినారాయణ యాదవ్, సిపిఎం పట్టణ కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.

ఉచిత 'కుట్టు శిక్షణ'పై వైసిపి విమర్శలు తగదు

ప్రజాశక్తి -అనంతపురం

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ల స్కీమ్‌పై వైసీపీ ఆరోపణలు తగదని ఏపీ పద్మశాలి సంక్షేమ అభివద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మినరసింహులు తెలిపారు. బుధవారం నగరంలోని టిడిపి అర్బన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో కుట్టుమిషన్ నేర్పించి, ఉచితంగా కుట్టుమిషన్ అందజేసే కార్యక్రమంపై ఆరోపణలు చేయడం తగదన్నారు. అవాస్తవాలను ప్రచారం చేస్తూ వైసిపి నాయకులు దుర్మార్గం మాట్లాడుతున్నారని చెప్పారు. ఎఫ్‌ఆర్ఎస్ నమోదు చేసి 75 శాతం హాజరు అయిన మహిళలకు మాత్రమే ఉచిత కుట్టుమిషన్లు అందజేస్తారన్నారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం టిడిపి పని చేస్తోందన్న విషయాన్ని వైసిపి నాయకులు గుర్తు పెట్టుకోవలని తెలియజేశారు.

11న ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-పామిడి

మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపం అమ్మవారు శాలలో ఈ నెల 11వ తేదీ లయన్స్ క్లబ్, బెంగుళూరు శంకర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, జిల్లా ఛైర్మన్ డాక్టర్ నల్లపాడు తిరుపతి నాయుడు తెలిపారు. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. చికిత్సలు వచ్చే వారు ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకుని రావాలన్నారు.

పల్లెల్లో సత్య హరిశ్చంద్ర నాటకం

ప్రజాశక్తి-పామిడి

నియోజకవర్గంలోని కదిరిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి ప్రభుత్వ సృజనాత్మక తెలుగు భాష సాంస్కృతిక శాఖ సహాయ సహకారాలతో పామిడి స్వరరాగ నాటకం కళా సమితి ఉచిత శిక్షణాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు దేవరాజు ఆధ్వర్యంలో సత్య హరిశ్చంద్ర రంగస్థలం పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. రంగస్థల పౌరాణిక నాటక కళలు అంతరించిపోతున్న తరుణంలో నిరుపేద కళాకారులను ఆదుకునే నిమిత్తం తెలుగు నాటక మాసోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పామిడి స్వరరాగ నాటక కళాసమితికి ఆధ్వర్యంలో పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తున్నారు. నాటక కళాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.దేవరాజు, వీరభద్ర గౌడ్, నారాయణరెడ్డి, పుంజా కృష్ణారావు, నాగార్జున, సుధాకర్, మస్తాన్, వన్నూరప్ప, గోరంట్ల, అనితకుమారి, నాగవేణి లు తమ తమ మధురగానం, నటనతో నాటకాన్ని ఆద్యంతం రక్తి కట్టించారు.

నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ఉపాధి కూలీకి పాముకాటు

ప్రజాశక్తి-బొమ్మనహల్

మండల పరిధిలోని ఉద్దేహళ్ గ్రామానికి చెందిన ఉపాధి కూలీ బసప్ప బుధవారం ఉదయం పాముకాటుకు గురయ్యాడు. బసప్ప ఉపాధి హామీ పనుల్లో భాగంగా కాలువలో పని చేస్తుండగా పాము కాటేసింది. వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్ అప్రమత్తమై అతిన్న చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బళ్లారికి తీసుకెళ్లారు. కూలి వైద్య ఖర్చుల నిమిత్తం ఎంపీడీవో విజయ్‌భాస్కర్ రూ.2వేలు అందించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో పాముకాటు చికిత్సకు అవసరమైన మందులు లేకపోవడంతో మండల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి పాముకాటు నియంత్రణకు అవసరం అయ్యే మందులను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.